క్లుప్తంగా

ఘనంగా ఆనంద వేంకటేశ్వరుని కల్యాణం



అనంతపల్లిలో వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నల్లజర్ల: అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలంకరణ, పూజలు, దర్శనాలు, నిత్యహోమం జరిగాయి. గరుడ వాహనంపై స్వామి,అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై, స్వామి వారిని దర్శించుకొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వేద పండితుడు పెదపూడి విజయ వెంకటరమణ, ఆలయ అర్చకుడు అగ్నిహోత్రుల సంతోష్, మదనగోపాలస్వామి ఆలయ అర్చకుడు డీవీ పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ఈ క్రతువులు జరిగాయి.

రెండు గ్రామాల్లో పోలీసు తనిఖీలు



డి.ముప్పవరం వాసులకు ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎస్సై రమేష్

నిడదవోలు రూరల్: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు బుధవారం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయ వద్ద రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఏఎస్సైలు పరమహంస, ఆంజనేయులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

నిడదవోలు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో ముందుగా ఇంగ్లిష్ నాలెడ్జ్, మహనీయుల జీవిత చరిత్ర, వేమన, దాశరథి శతకాలు, దేశభక్తి గీతాలు, తెలుగు పద్యాలు చదివించారు. అనంతరం గ్రంథాలయాలు–వాటి ఉపయోగాలపై విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచే చినబాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, పొన్న సుబ్రహ్మణ్యశర్మ, కుందుల ప్రభాకరరావు, యాసరపు రామకృష్ణ, గొన్నాబత్తుల రామారావు, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు బడిబాట పట్టేలా..

- ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సర్వే
- నియోజకవర్గంలో 335 మంది గుర్తింపు
- వారికి ఎన్నో రాయితీలు



ఇంటింటి సర్వే చేస్తున్న భవిత కేంద్రం ఉపాధ్యాయులు



భవిత కేంద్రంలో చిన్నారులకు ఆటలు

చాగల్లు: దివ్యాంగ చిన్నారులు బడిబాట పట్టించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. చదువుకు దూరమైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీల గురించి పిల్లల తల్లి దండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా ఇప్పటికే కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు మండలంలో 129 మందిని, తాళ్లపూడి మండలంలో 108 మందిని, చాగల్లు మండలంలో 98 మంది చిన్నారులను గుర్తించారు. వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ఇంటింటి సర్వే

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ చిన్నారులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిపై అవగాహన లేకపోవడంతో చాలామంది దివ్యాంగుల తల్లిదండ్రులు వాటి ప్రయోజనాలు పొందలేక పోతున్నారు. వారికి కూడా విద్యను అందించే కేంద్రాలున్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై, ఇళ్లకే పరిమితమై ఉండిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మే 1న ఈ సర్వే ప్రారంభమైంది. ప్రస్తుత వేసవి సెలవుల సమయాన్ని దీని నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన వారందరినీ బడుల్లో చేర్పించేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశారు.

ఎన్నో ప్రయోజనాలు

- ప్రత్యేక అవసరాల గల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉం టాయని అధికారులు తెలియజేస్తున్నారు.
- దివ్యాంగ విద్యార్థుల చదువుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితం గా ట్యాబులు అందజేస్తారు.
- వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువ పత్రాలతో సామాజిక పింఛను లభించేలా చూస్తారు.
- బస్సులు, రైళ్లలో ప్రయాణం చేయడానికి పాస్ సదుపాయం కల్పిస్తారు.
- పాఠశాలలకు రాలేని వారి ఇళ్లకు ఉపాధ్యాయులే వచ్చి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు నమోదు చేస్తారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నాం



మండలాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించేందుకు ఐఈఆర్‌టీలు ప్రత్యేకంగా ఇంటింటి సర్వేలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటి వరకూ కొవ్వూరు నియోజకవర్గంలో 335 మంది చిన్నారులను గుర్తించాం. వారంతా బడికి వచ్చే అవకాశాలు ఉన్నా రావడం లేదు. అలాంటి బాలల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేస్తున్నాం. చిన్నారులను భవిత కేంద్రానికి రప్పించి విద్యాబుద్ధులు నేర్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం కోసం కృషి చేస్తున్నాం.

– కె.కనకబాబు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త

ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదు



ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే నెల 8 వరకూ భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయునితో ఇంటింటి సర్వే నిర్వహిస్తాం.

– బి.రామచంద్రరావు, భవితకేంద్రం ఉపాధ్యాయుడు, చాగల్లు

దివ్యాంగ విద్యార్థుల వివరాల నమోదు

నిడదవోలు రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పి.గురుమూర్తి సూచించారు. మండలంలోని దివ్యాంగ విద్యార్థుల కోసం ఈనెల 1 నుంచి జూన్ 9 వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేస్తామన్నారు. అవసరాలు కలిగిన విద్యార్థులకు రవాణా భత్యం, ఎస్కార్ట్ సదుపాయం, బాలికల అలవెన్స్, ఫిజియోథెరపీ తదితర సేవలు ఉచితం కల్పిస్తున్నామన్నారు. ఐఈఆర్పీలు ఆర్.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌లో వరి విత్తనాల విక్రయం

నిడదవోలు రూరల్: ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను నిడదవోలు డీసీఎంఎస్‌లో విక్రయిస్తున్నట్టు ఆ సంస్థ మేనేజర్ పి.శ్రీనివాస్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఎంఎస్ గోదాములో పీఎల్‌పీ, ఎంఎస్ 1318, బీపీటీ 5204, ఎంఎస్ 1064, ఎంఎస్1061, ఎంఎస్ 7029, సంపద గోల్డ్ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్టిఫైడ్, ఫౌండేషన్ విత్తనాలను విక్రయిస్తున్నామని, రైతులంతా అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

మానవత సంస్థ అధ్యక్షుడిగా సురేష్

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా అంకెం సురేష్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ సంస్థ మండల చైర్మన్ సింహాద్రి జనార్దనరావు బుధవారం తెలిపారు. త్వరలోనే నూతన కమిటీ ఏర్పాటు కానుందని చెప్పారు. తాళ్లపూడి సాయిబాబా ఆలయం వద్ద మండల శాశ్వత కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

పరిశుభ్రంగా భోజనం అందించండి

- ఎంఈవో సీహెచ్ బాలామణి
- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



మలకపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇస్తున్న శిక్షణ

తాళ్లపూడి: విద్యార్థులకు పరిశుభ్రంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. మండలంలోని 36 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్పర్లకు బుధవారం మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఒక రోజు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం తయారీలో వచ్చే విద్యా సంవత్సరంలో వారు పాటించాల్సిన నిబంధనలను మాస్టర్ ట్రైనర్ సీహెచ్ బంగారమ్మ వివరించారు. పలు సలహాలు అందజేశారు. అనంతరం తాళ్లపూడి, మలకపల్లి, అన్నదేవరపేట స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా పోషక విలువలున్న హాట్ పొంగల్, పులిహోర, ఆకు కూరలతో తయారు చేసే వంటకాలపై పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలామణి మాట్లాడుతూ మెనూ ప్రకారం, పరిమాణం ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందజేయాలన్నారు. ఎంఈవో– 2 సీహెచ్ నెహ్రూజీ మాట్లాడుతూ జూన్ 12 నుంచి ప్రారంభం అయ్యే కొత్త విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన మెనూ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎండీఎం కో–ర్డినేటర్ వెంకటరాజు, డివైఈవో ఆఫీస్ నుంచి కిషోర్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీవాసవి, సీఆర్పీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం మండలం చిట్యాలలో..

గోపాలపురం: మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన తయారీ కార్మికులకు నూతన మెనూ విధానంపై మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ ఇచ్చారు. జూన్ 12 నుంచి పాఠశాలల్లో నూతన మెనూ అమలు చేయాలని కార్మికులకు సూచించారు. ఈయన వెంట ఎంఈవో ఆకుల మహేశ్వరరావు, ఎండీఎం ఏడీ వీవీ రాజు, పద్మావతి, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- కొవ్వూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ
- వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యునివర్సిటీలో జూన్ 4న నిర్వహించే కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఓట్ల లెక్కింపుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లెక్కింపులో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. తమకు కేటాయించిన విధులను కౌంటింగ్ సిబ్బంది నిబద్ధత, చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌తో కలిసి ఎన్ని కౌంటింగ్ టేబుళ్లు ఉంటే అంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంటు లేని సమయంలో ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చురు. కౌంటింగ్‌కు ఐదుగురు ఏఆర్‌వోలను నియమించామని చెప్పారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు, కాంగ్రెస్ తరఫున గంధం బాబ్జి, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.శేఖర్‌బాబు, స్వతంత్ర్య అభ్యర్థులు ఊబా శ్రీకాంత్, కొక్కిరిపాటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో తమకు కేటాయించిన విధులను నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వర్తించాలని నిడదవోలు నియోజకవర్గ ఆర్వో ఆర్.వెంకటరమణ నాయక్ సూచించారు. జూన్ నాలుగో తేదీన రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్వో రమణ నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు ఫారం– బి ద్వారా జూన్ ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ జరిగే కేంద్రానికి ఏజెంట్లు ఉదయం 6 గంటలకు హాజరు కావాలన్నారు. లెక్కింపు కేంద్రంలో 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభిస్తామన్నారు. ఉదయం 8:30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుందని పేర్కొన్నారు. 13– ఏ డిక్లరేషన్ ఉంటేనే పోస్టల్ బ్యాలెట్‌లను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈవీఎంల కౌంటింగ్ నిర్వహణకు 14, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు వి.నాగభూషణం, డి.సుధ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకటరమణ నాయక్

దేవదాయ – ధర్మదాయ శాఖ

టెండరు కం- బహిరంగ వేలం ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కుమారదేవం గ్రూపు దేవాలయములకు సంబంధించిన ఈ దిగువ పట్టిక దాఖలా గ్రామాలలో గల భూములను సదరు దేవాలయముల నందు 11.06.2024 తేదీ మంగళవారం ఉదయం గం.10.00 గంటల నుండి 3 సంవత్సరముల కాలపరిమితికి అనగా 2024–25 సంవత్సరము నుండి 2026–27 సంవత్సరము వరకు టెండర్ కం బహిరంగ వేలంపాటను సదరు ఆలయముల ఆవరణలో హిందూ దేవదాయ ధర్మదాయ అధికారుల సమక్షమున కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును.

వ. నెం	దేవస్థానము పేరు	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం	పరిమితి య.సెం.	ధరావత్తు సొమ్ము రూ.	వేలం జరుగు ప్రాంతము తేదీ, సమయం
1.	శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము, ధర్మవరం	ధర్మవరం	168	2.71	5,000/-	శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము, ధర్మవరం ఉదయం గం.10.00లకు
2.	శ్రీ మదన గోపాల స్వామి వారి దేవస్థానము, పెనకనమెట్ల	పెనకన మెట్ల	44	2.56	5,000/-	శ్రీ మదన గోపాల స్వామి వారి దేవస్థానము, పెనకనమెట్ల, ఉదయం గం.11.00 లకు
	-- డిటో--	పెనకనమెట్ల	44	2.56	5,000/-	
	శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము, పెనకనమెట్ల	పెనకనమెట్ల	129	4.20	10,000/-	-- డిటో--
3.	శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము, కుమారదేవం	కుమార దేవం	313/4	3.98	10,000/-	శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము, కుమారదేవం మధ్యాహ్నం గం.12.30 లకు
	-- డిటో--	కుమార దేవం	301/1 బి	2.00	10,000/-	
	-- డిటో--	దొమ్మేరు	42/2	1.04	10,000/-	

కావున ఆసక్తి గల పాటదారులు పట్టిక దాఖలా తెలిపిన ధరావత్తులను చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములు కొరకు శ్రీ గండి పోశమ్మ అమ్మ వారి ఆఫీసు పనిదీయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కుమారదేవం, 29-05-2024

వేగేశ్న ఆంజనేయరాజు, కార్యనిర్వహణాధికారి, సెల్ : 99514 77588

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



కరాటే నేషనల్ టోర్నీలో ప్రతిభ కనబరిచిన కొవ్వూరు విద్యార్థులు



పతకాలు సాధించిన దేవరపల్లి విద్యార్థులు

కొవ్వూరు: మహారాష్ట్రలోని ఖండాలాలో ఈనెల 21 నుంచి 27 వరకూ నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే కోచింగ్ క్యాంపు, నేషనల్ టోర్నమెంట్‌లో కొవ్వూరు విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిది రాష్ట్రాల నుంచి మొత్తం 500 మంది కరాటే క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కొవ్వూరుకు చెందిన అఫీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి పది మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో ఎం.జెమియా జాయ్ తొమ్మిదేళ్ల కటా, కుమితే విభాగంలో రెండు వెండి పతకాలు, ఎం.షణ్ముఖ 12 ఏళ్ల కటా, కుమితే విభాగంలో వెండి, బంగారు పతకాలు, బి.విజయ్ ఏడేళ్ల విభాగంలో వెండి, కాంస్య పతకాలు సాధించారు. అలాగే ఎం.అఖిల్ 14 ఏళ్ల విభాగంలో బంగారు, వెండి పతకాలు, టి.గీతిక 14 ఏళ్ల విభాగంలో వెండి, కాంస్య పతకాలు, కె.ప్రశాంత్ కుమార్ 19 ఏళ్ల విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించినట్టు కరాటే శిక్షకురాలు ఆకుల రాధ వివరించారు. జపాన్ గ్రాండ్ మాస్టార్ సోకకే కొయిచీ యమమురా, సెన్సయ్ కెంటారో యమముర రెన్షీ పరంజీత్ సింగ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్‌లో తాను (ఆకుల రాధ) బ్లాక్ బెల్ట్ నాలుగో డాన్ నుంచి ఐదో డాన్‌కు, సీనియర్ ఇనస్ట్రక్టర్ శరత్ కల్యాణ్ బ్లాక్ బెల్ట్ రెండో డాన్ నుంచి మూడో డాన్‌కు ఉత్తీర్ణత సాధించినట్టు ఆకుల రాధ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడో స్థానాన్ని సాధించినట్టు ఆమె చెప్పారు.

నేపాల్ టోర్నీలో దేవరపల్లికి ఏడు పతకాలు

దేవరపల్లి: ఈ నెల 21 నుంచి 26 వరకూ నేపాల్ దేశంలోని పోక్రా సిటీలో ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న దేవరపల్లికి చెందిన ఏడుగురు విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, బంగారు, రజత పతకాలు సాధించినట్టు కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో వి.హేమ, కె. తీర్థ, ఎస్. జోష్ణ, ఎస్. కిరణ్ కుమార్‌లు బంగారు పతకాలు, ఎస్. గెలీలియా, జి.కార్తీక్, జె.రేష్మలకు రజత పతకాలు లభించాయి. వారికి నేపాల్ కరాటే కోచ్ అండ్ రిఫర్ బీమ్లా పతకాలు ప్రదానం చేసినట్టు మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.



కృష్ణబాబు కుటుంబానికి పలువురి పరామర్శ



కృష్ణబాబు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను దొమ్మేరు గ్రామంలోని ఆయన స్వగృహంలో బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఉంగుటూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులు కృష్ణబాబు చిత్ర పటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. కృష్ణబాబు అల్లుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, ఆంధ్ర సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మైనర్లకు వాహనమిస్తే జైలు తప్పదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వాహన యజమానులు నిర్లక్ష్యంగా మైనర్లకు వాహనాలు ఇస్తే.. వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 80 వాహనాలు సీజ్ చేసి, వాహన యజమానుల నుంచి జరిమానాలు వసూలు చేశారు. బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ల తల్లిదండ్రులు, సంరక్షకులు, పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇక నుంచి మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహనదారులకు, మైనర్ల తల్లిదండ్రులు, సంరక్షుల లైసెన్సులూ రద్దు చేయడంతో పాటు, ఇతర చర్యలు తీసుకుంటామన్నారు.

10 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అందుకు బాధ్యుడైన ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు దేవరపల్లి ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈదాడుల్లో ఎస్సై పి. సుధీర్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్షకు 115 మంది గైర్హాజరు

దేవరపల్లి: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు మండలంలో 115 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ జి. శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 260 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 145 మంది మాత్రమే హాజరయ్యారు.

విధమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

దేవరపల్లి: స్థానిక రజకుల ఆధ్వర్యంలో బుధవారం విధమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రజకులు కులదేవత అయిన విధమ్మతల్లి మహోత్సవాలను జూన్ 2 వరకూ నిర్వహించనున్నట్టు రజక సంఘం సభ్యులు కొంజర్ల సత్యనారాయణ, కడల్లి సుబ్బయ్య, లింగాల భద్రయ్య, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు.

భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

Dr.BR.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము హక్కు భుక్తములైయున్న లొల్ల మరియు ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, కాల్దరి గ్రామాలలో గల ఈ క్రింది సర్వే నెంబర్లలో గల య 8.04 సెంట్లు భూములకు ఈ క్రింది వివరించిన విధముగా కౌలు హక్కుల కొరకు 3 సంవత్సరముల కాలపరిమితికి 2024-25 నుండి 2026-27 వరకు గాను దేవదాయ శాఖ అధికారుల సమక్షమున ఆంధ్రప్రదేశ్ హిందూ దేవదాయ ధర్మదాయ చట్టం లోని Sec 82(1) ప్రకారం G.O.Ms.No.379, Dt.11/08/2003 మరియు సవరించిన G.O.Ms.No.425, Dt.09/11/2015 లోని నిబంధనల మేరకు దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల ఆమోదము మేరకు బహిరంగ వేలం నిర్వహించబడును.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం- వాడపల్లి

వ	భూమి ఉన్న గ్రామం	రి.స. నెం	విస్తీర్ణం (య.)	ధరావత్తు	సాల్వెన్సీ	వేలం నిర్వహించు తేది / పాట జరుగు ప్రదేశం
1	లొల్ల, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా	101/2	0.68 సెంట్లు	రూ.10,000/-	2,00,000/-	ది:10/06/2024 లొల్ల పంచాయతీ కార్యాలయం లేదా గ్రామ సచివాలయం వద్ద 11.00 గంటలకు
2	కాల్దరి, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా	414	7.36 సెంట్లు	రూ.50,000/-	5,00,000/-	ది:11/06/2024 కాల్దరి పంచాయతీ కార్యాలయం లేదా గ్రామ సచివాలయం వద్ద 11.00గంటలకు
		మొత్తం	8.04 సెంట్లు			

డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానము హక్కు భుక్తములైయున్న బొబ్బిల్లంక గ్రామంలో గల ఈ క్రింది సర్వే నెంబరులో గల య 2.37 సెంట్లు భూములకు ఈ క్రింది వివరించిన విధముగా కౌలు హక్కుల కొరకు 3 సంవత్సరముల కాలపరిమితికి 2024-25 నుండి 2026-27 వరకు గాను దేవదాయ శాఖ అధికారుల సమక్షమున ఆంధ్రప్రదేశ్ హిందూ దేవదాయ ధర్మదాయ చట్టంలోని Sec 82(1) ప్రకారం G.O.Ms.No.379, Dt.11/08/2003 మరియు సవరించిన G.O.Ms.No. 425, Dt.09/11/2015 లోని నిబంధనల మేరకు దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఆమోదము మేరకు బహిరంగ వేలం నిర్వహించబడును.

శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం - వాడపల్లి

వ	భూమి ఉన్న గ్రామం	రి.స. నెం	విస్తీర్ణం (య.)	ధరావత్తు	సాల్వెన్సీ	వేలం నిర్వహించు తేది / పాట జరుగు ప్రదేశం
1	బొబ్బిల్లంక, డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా	190/4	2.37 సెంట్లు	రూ.25,000/-	2,00,000/-	ది:12/06/2024 బొబ్బిల్లంక పంచాయతీ కార్యాలయం లేదా గ్రామ సచివాలయం వద్ద 11.00 గంటలకు
		మొత్తం	2.37 సెంట్లు			

షరతులు: 1) ఈ బహిరంగ వేలం దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీయుత ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి బహిరంగ వేలం నిర్వహించబడును. 2) సంస్థకు బకాయి ఉన్న వారు గాని, ఇతరత్రా లావాదేవీలు ఉన్న వారు గాని పాటలో పాల్గొనుటకు అనర్హులు. 3) పాటలో పాల్గొను వారు పై పట్టికలో తెలిపిన ప్రకారం ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాటలో పాల్గొనదలచిన వారు భూమి హెద్దు తగ్గులను ముందుగా చూసుకొని హిందువులు మాత్రమే పాటలో పాల్గొనవలెను. హెచ్చు పాట దారులు 1 సంవత్సరం శిస్తు ముందుగా చెల్లించు నిర్ణయం. పాటలో పాల్గొను వారు సాల్వెన్సీ సర్టిఫికేట్ ఏదైన జాతీయ బ్యాంక్ నుండి పొంది జతపర్చవలెను. 4) ఏకారణము చేతనైనా పాట నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు. మిగిలిన వివరములు, షరతులను దేవస్థానం కార్యాలయము పని చేయు వేళలలో తెలుసుకోవచ్చును.

స్థలం: వాడపల్లి
తేది: 27/05/2024.

Sri Bh.V.S.N.Kishore Kumar
Deputy Commissioner & Executive Officer

